www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5



13న లబ్ధిదారులతో ప్రధాని వర్చువల్ సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

ఆర్థిక సాధికారత పథకాల కింద లక్షిత సమూహాల లబ్ధిదారులతో ఢిల్లీ నుంచి వర్చువల్ మోడ్‌లో జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహిస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆ రోజు సాయంత్రం 4.00 గంటలకు అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో 3 జిల్లాల్లో లబ్ధిదారులతో వర్చువల్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 12న నోడల్ అధికారులతో అమలాపురంలో వర్చువల్ ఏర్పాట్లు పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. ఢిల్లీలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లైజెన్ అధికారి కోరారన్నారు.

శివారు ప్రాంతాలకు అందని సాగునీరు

- ఎండిపోతున్న వరి పంట పొలాలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు

ప్రజాశక్తి-అమలాపురం

అధికారులు సమన్వయంతో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి కాలువ చిట్టచివరి భూములకు సాగునీరు అందించాలని, సాగునీరు ఏ ఒక్క ఎకరానికి అందలేదన్న మాట వినిపించకూడదని అధికారులు ప్రజాప్రతినిధులు జిల్లా నీటి యాజమాన్య సమావేశంలో పలికిన పలుకులు. కానీ వాస్తవంగా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వార బందీ విధానంపై రైతులకు పూర్తి అవగాహన పెంపొందించి సక్రమంగా సాగునీరు సరఫరా చేయాలని రబీ సీజన్‌ను మార్చి 31 నాటికి పూర్తి చేసే దిశగా రైతాంగాన్ని చైతన్యపరిచి తక్కువ కాల పరిమితి గల వరి వంగడాలు రకాలను ప్రోత్సహించాలని, తదుపరి మూడో పంటకు అవకాశం కల్పించాలని ఆ సమావేశాల్లో చెప్పే మాటలు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వారబంది పద్ధతి అమలు ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ వంట కాలువ శివారు ప్రాంతాలకు సాగునీరందక వరిచేలు బీటలు వారాయి. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరిచేలు పాలు పోసుకుని, ఈనిక స్థితిలో సాగునీరు అందని పరిస్థితుల్లో నీటి ఎద్దడితో అల్లాడుతుండటంతో రైతులకు భారీ నష్టం సంభవించే అవకాశం ఉంది. మిచౌంగ్ తుపానుతో తొలకరి పంట పూర్తిగా నష్టపోయిన జిల్లా రైతులు దాళ్వా పంట లోనైనా నాలుగు బస్తాలు పండితే అప్పులు తీరుతాయని పెట్టుకున్న ఆశలు ఆడియాసలుగానే మిగిలే పరిస్థితి కనపడుతోంది. కాలువల మీద ఉండే షట్టర్ గేట్లకు గతంలో ఏ విధమైన రిపేర్లు చేయకపోవడంతో మరమ్మతులకు గురై సాగునీరు సక్రమంగా సరఫరా కాని పరిస్థితి నెలకొంది. నీరందక బీటలు వారుతున్న వరి చేలు చూడలేక ఇప్పటికే ఎకరాకు రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి ఉన్న రైతులు వరిచేను ఎండిపోకుండా స్థానికంగా బోర్లు అందుబాటులో ఉంటే గంటల లెక్కన డబ్బులు చెల్లించి వరిచేలకు నీరు తోడుతున్నారు. దీనివల్ల రైతుకు ఎకరాకు రూ.2000 నుంచి రూ.3000 అదనంగా పెట్టుబడి అవుతోంది. ప్రభుత్వం వారు వారబంది లెక్కన పది రోజులకు ఒకసారి ఆయకట్టుకు వంతులు లెక్క, కేవలం 36 గంటల సమయం నీరు వదులుతుంటే కొంతమంది రైతులు కూడా నీరు పెట్టుకోలేక ఇప్పుడిప్పుడే ఈనుతున్న వరిచేలు పాడైపోతుంటే చూడలేక కన్నీరు మున్నీరు అవుతున్నారు. అధికారులకు కలిసి మా కాలువకు నీరు ఎప్పుడు వస్తుందంటే పది రోజులకు ఒకసారి వంతు, ఫలానా తేదీన వస్తుంది, రోజు పూట వస్తుంది, మరలా వేరే వాళ్లకి నీరు అందించాలని సమాధానం చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ పంట ఒక లక్షా 72 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అధికారులు రబీ 2023-24, ఫసలీ-1433 సాగు ప్రారంభ దశలో ఈ పంటకు నీటి లభ్యత తక్కువగా ఉంది. డ్రైన్లలో క్రాస్ బండ్లు వేస్తూ లభించిన ప్రతి నీటి బొట్టును సాగునీటి కోసం వినియోగించాలని చెప్పారు. అధిక దిగుబడులు సాధించే దిశగా రెవెన్యూ జలవనరులు వ్యవసాయ, డ్రైనేజీ శాఖల అధికారులు రైతు సంఘాలు రైతుల పటిష్ట సమన్వయ గ్రూపుగా ఏర్పడిన రబీ సాగు నుండి రైతులను గట్టెక్కించాలని అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి రైతులకు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలు అయ్యాయి. జిల్లాలో అంబాజీపేట, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, అమలాపురం తదితర మండలాల్లో శివారు ప్రాంతాలకు నీరందక రైతులే ఇబ్బంది పడుతున్నారు.


మామిడికుదురులో నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్ ఫోటో)


ఇసుకపూడిలో సాగునీరు అందక బీటలు వారిన వరి చేను

గతంతో పోలిస్తే సమస్య తక్కువే

గతంతో పోలిస్తే సాగునీటి ఇబ్బంది జిల్లాలో ఈ ఏడాది తక్కువే. కలెక్టర్ సహకారంతో కాలువల షట్టర్లకు మరమ్మతులు చేయించడం, పూడికలు తీయించడం వంటి పనులు చేపట్టాము. గోదావరి సెంట్రల్ డెల్టాకు గతేడాది 1400 క్యూసెక్కుల సాగునీరు అందజేయగా ఈ ఏడాది 1720 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశాం. శివారు ప్రాంతాల్లో అక్కడక్కడా రెండు, మూడు ఎకరాలకు ఇబ్బందులు ఉండవచ్చు వాటిని కూడా అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

డి.వి రామ్ గోపాల్, ఇరిగేషన్ ఇఇ, అమలాపురం.

ఇంజనతో నీరు పెట్టుకోవాల్సి వస్తోంది

నేను సొంతం, కౌలు కలిపి నాలుగు ఎకరాలు వ్యవసాయం చేస్తున్నాను. మాకు కాలువకి వంతుల వారీగా 11 రోజులకు ఒకసారి నీరు వస్తుందని అధికారులు చెబుతున్నారు. చేలు ఇప్పుడిప్పుడే పొట్ట దశలో ఉన్నాయి. ఇప్పుడు నీరు అందకపోతే ఇబ్బంది ఉంటుంది. గంటకు రూ.150 చొప్పున ఇంజన్‌తో నీరు తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేనంతా బీటలు వారి పోయింది.

- ఎ.రాంబాబు, వ్యవసాయం రైతు, ఇసుకపూడి, అంబాజీపేట మండలం.

మౌలిక సదుపాయాలకు సిఎం పెద్దపీట

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాలకు సిఎం జగన్ పెద్దపీట వేశారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. గోపవరం, చల్లపల్లి, కిత్తనచెరువు గ్రామాల్లో సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య (బాబాయ్), ఇసుకపట్ల జయమణి, కుంచే గౌరి అధ్యక్షతన సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి విశ్వరూప్ పాల్గొన్నారు. చల్లపల్లిలో జిజిఎంపి నిధులు రూ.కోటి 20 లక్షలతో పలు సిసి రోడ్లను ప్రారంభించారు. పలు రోడ్లకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలనా ఆవిష్కరించారు. అదే గ్రామంలో రూ.26 లక్షలతో నిర్మించనున్న ఒహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్‌కు మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గోపవరం, కూనవరం గ్రామాల్లో ఒక్కొక్కటీ రూ.23.94 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలను గోపవరంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. చల్లపల్లి తూర్పుపేటలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు డ్రైన్‌ను కూడా మంత్రి విశ్వరూప్ ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి విశ్వరూప్‌కు ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. చల్లపల్లిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు ఆధ్వర్యంలో మంత్రి విశ్వరూప్‌కు పూలవర్షం కురిపించి మేళ తాళాలతో ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పేద ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న సిఎం జగన్‌ను మరోమారు సిఎంగా చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి, వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి గెడ్డం సంపదరావు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, ఎంపిటిసిలు కొంకి ఏడుకొండలు, కాట్రు ధనలక్ష్మి, వంగా గిరిజా కుమారి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఎఎంసి వైస్ చైర్మన్ బడుగు మేరీ కుమారి, డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, మాజీ ఎంపిటిసి కోరుకొండ మంగాయమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, కార్యదర్శి పినిపే జయరాజు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీల అధ్యక్షులు దంగేటి దొరబాబు, నడింపల్లి వాసురాజు, అడపా రమేష్, ఊటాల రామాంజనేయులు, చిక్కం బాలయ్య, ఓగూరి విజయ్ కుమార్, కోటుం లోవరాజు, ఎంపిడిఒ కెవి.ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీకుమారి పాల్గొన్నారు.


చల్లపల్లిలో సిసి రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అర్జీదారుల సంతృప్తే ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి-అమలాపురం

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన జెసి ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుతో కలిసి అర్జీలను స్వీకరించారు. మండల స్థాయి నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత తహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలిసి వర్చువల్ విధానంలో సంప్రదించి అర్జీదారులకు తగు పరిష్కార మార్గాలు చూపారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 245 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ బి.శివ శంకర్ ప్రసాద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎస్.మధుసూదన్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీ దేవి, డిపిఒ డి.రాంబాబు, డిఎస్ఒ పాపారావు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

ప్రజాశక్తి-అమలాపురం

సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందించాలని తీర్పునిచ్చినా సమయం ఇవ్వాలని ఎస్‌బిఐ కోరడానికి నిరసనగా స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద సిపిఎం ఆధ్వర్యలో ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు మాట్లాడుతూ తక్షణం ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లను, భూర్జువా పార్టీలను కాపాడేందుకే ఎస్‌బిఐ ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వకుండా దాట వేస్తోందన్నారు. సుమారు దేశవ్యాప్తంగా కోట్ల మంది ఖాతాదారులను కలిగిన అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తుందని ఐదు నిమిషాల వ్యవధిలో ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పే టెక్నాలజీ ఎస్‌బిఐ దగ్గర ఉందని కార్పొరేట్ కంపెనీలను బడా బూర్జువా పార్టీలను కాపాడేందుకు ఎన్నికల బాండ్ల వివరాలను చెప్పేందుకు నిరాకరిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల ముసుగులో క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారని, కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు ధారాధత్తం చేశారని చెప్పారు. ఈ ధర్నాలో జి.దుర్గాప్రసాద్, ఎం.బలరామ్, నాయకులు, విప్పర్తి మోహన్ రావు, భాస్కరరావు, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.



ఎస్‌బిఐ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

వృద్ధులకు సర్పంచ్ రాంబాబు సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరుకు చెందిన నిరుపేదలైన వద్ధ దంపతులు మతుకుమిల్లి సత్య నారాయణ, లక్ష్మీ కాంతంకు సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ.8 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. వారికి ఏ సాయం కావాల్సి వచ్చినా తనను సంప్రదించాలని ఆయన వారికి సూచించారు.


నగదు ఇస్తున్న సర్పంచ్ రాంబాబు


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

పలువురికి ఎంఎల్ఎ వేగుళ్ల పరామర్శ


ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో మాత వియోగంతో భాదపడుతున్న చింతల శ్రీను, 23వ వార్డులో ఇటీవల మరణించిన గొర్లె అక్కమ్మ కుటుంబాలను మంగళవారం ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఆయన వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మేడింటి సూర్యప్రకాష్, పాలచర్ల శిరీష్ తదితర్లు ఉన్నారు.

చేయూతతో మహిళలకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి-రామచంద్రపురం, అయినవిల్లి

జగనన్న చేయూత పథకంతో మహిళలందరికీ ఆర్థిక భరోసా లభించిందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మహిళలకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు రూపకల్పన చేసిన జగన్మోహన్ రెడ్డిని మహిళలందరూ మరొకసారి ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలన్నీ మహిళలకే అందించటం గొప్ప విషయం అన్నారు. అనంతరం రూ. 7 కోట్ల 31 లక్షల 25 వేల చెక్కును చేయూత అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, వైసిపి పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, అంబటి నెహ్రూ, మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరావు, కొలమూరి శివాజీ, కమిషనర్, శ్రీనివాసులు ఎంపిడిఒ రామచంద్రరావు పాల్గొన్నారు. అయినవిల్లి మండలంలో చేయూత చెక్కులను ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపిపి మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్‌పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, బొంతు రాజేంద్రప్రసాద్, వైసిపి మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎఎంసి చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, ఎంపిడిఒ మూర్తి పాల్గొన్నారు.



అయినవిల్లిలో చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ, జెడ్‌పి చైర్మన్


సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ, రాపాక వరప్రసాద్


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అయినవిల్లి


గ్రామ సచివాలయల ఏర్పాటుతో ఎపి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. అయినవిల్లి లంకలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం అయిన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ఏ సమస్యకైనా గ్రామ సచివాలయాలే కేరాఫ్ అడ్రస్‌గా మారాయన్నారు. అవినీతి రహిత పారదర్శక పాలన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతోందన్నారు. ఇలాంటి అద్భుతమైన గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొంతు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ కుమ్మరి మాధవి, ఎంపిటిసిలు దాసరి శైలజ, బయా చినబాబు, యడ్ల కిరణ్‌బాబు పాల్గొన్నారు.

బిజెపి అంటే బాబు జగన్ పవన్

ప్రజాశక్తి-కాట్రేనికోన

బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అనే విధంగా ఆయా పార్టీలు అంట కాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి గెడ్డం సురేష్ బాబు విమర్శించారు. సోమవారం పార్టీ నాయకులతో కలిస ఆయన మాట్లాడారు. ఈ నాలుగు రాజకీయ పార్టీల నాయకులకు ప్రజాప్రతినిధులుగా చెప్పుకునే అర్హత లేదన్నారు. బిజెపి మతతత్వానికి స్నేహ హస్తం అందిస్తూ, బానిసలుగా మారి రాష్ట్ర ప్రయోజనాలను ప్రణంగా పెట్టారన్నారు. ఎన్నికల పొత్తు వల్ల బాబు, పవన్ రాజకీయంగా లబ్ధి పొందవచ్చు, రహస్య మిత్రునిగా సిఎం జగన్‌కు ఊరట దొరకవచ్చు కానీ ఈ నాలుగు రాజకీయ పక్షాలూ రాష్ట్రానికి, ప్రజలకు తీరని నష్టాన్ని చేస్తున్నాయని అన్నారు. తమతో పొత్తు పెట్టుకొన్న రాజకీయ పార్టీలను చీల్చి, ప్రతినిధులను సంతల్లో పశువుల్లా కొని, ప్రజా ప్రభుత్వాలను పడగొట్టడానికి బిజెపి రాష్ట్రాన్ని నిర్వీర్యం చేయాలని కలలు కంటుందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ బహిరంగంగా మోదీ ముఠాలో చేరితే, సిఎం వైఎస్.జగన్ రహస్యంగా మోదీ ముఠాలో భాగస్వామిగా ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అయితాబత్తుల పండు బాబు, కంచుస్తంభం సోనీ, పాలెపు ధర్మారావు, పెమ్మాడి స్వామి, బాలకృష్ణ, గోపి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



హామీలు అమలు చేసిన జగన్ ప్రభుత్వం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేసింది వైసిపి ప్రభుత్వం మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. వెంకటాయపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, 2020లో కోవిడ్ వల్ల ఆదాయం పూర్తిగా నష్టపోయామని, అయినప్పటికీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది సాధారణంగా జరుగుతుందని చెప్పారు. ఈసారి జరిగే ఎన్నికలకు ప్రజలే న్యాయ నిర్ణేతలని చెప్పారు. పరిపాలన వికేంద్రీకరణ కోసం సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సర్పంచ్ ఎల్లమెల్లి సతీష్ కుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో నాయకులు పెట్టా శ్రీనివాసరావు, వాసంశెట్టి శ్యామ్ కుమార్, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, సర్పంచులు అయ్యల రాంబాబు, నాగిరెడ్డి సతీష్ రావు, ఎంపిటిసిలు కనితి ఈశ్వరి, యన్నం దేవి, తుమ్మూరి సుబ్బలక్ష్మి, రాయుడు చంద్రరావు, యల్లమెల్లి రవికుమార్, దడాల రవికుమార్ పాల్గొన్నారు.


బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మత్స్యకారుల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను సిఎం వైఎస్.జగన్ అమలు చేస్తున్నారని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. కొండాలమ్మ చింత ప్రాంతంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం ఐదో విడత మత్స్యకార భరోసా నిధుల పంపిణీలో ఎంఎల్ఎ లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో ఒఎన్‌జిసి కార్యకలాపాలతో నష్టపోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు సిఎం జగన్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. నియోజకవర్గ పరిధిలో 23,458 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరి ఖాతాలో రూ.69 వేల చొప్పున జమ కానున్నట్లు తెలిపారు. డీజిల్‌పై సబ్సిడీని పెంచామని గుర్తు చేశారు. తీర ప్రాంతంలో చమురు సంస్థలు 8 రిగ్గులు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయని, ఈ రిగ్గుల వల్ల సుమారు 270 కిలో మీటర్ల మేర వేట నిషేధం ఉంటుందని, ఈ ప్రాంతంలో వేటపై ఆధారపడిన వారికి నష్టపరిహారం అందించే విధంగా కేంద్ర, రాష్ట్రాల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. గతంలో జిఎస్‌పిఎస్ కార్యకలాపాల వల్ల నష్టపోయిన వారికి రూ.700 కోట్లు నష్టపరిహారం ఇప్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఇప్పటివరకు నాలుగు విడతలుగా ఒక్కో మత్స్యకారుడికీ రూ.2 లక్షల 7 వేలు అందించామన్నారు. వైసిపి అమలాపురం పార్లమెంట్ కోఆర్డినేటర్ రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ తీర ప్రాంతంలో చమురు సంస్థల కార్యకలాపాలతో నష్టపోతున్న మత్యాకరులను చమురు సంస్థలు నుండి నిధులు సేకరించి ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దున్నా జనార్ధనరావు, ఢిల్లీ నారాయణ, పి.చిట్టి రాజు, పి.చిట్టిబాబు, కాశి ముని కుమారి, ఎంపిపిలు కోలా గంగాభవాని, పాలెపు లక్ష్మి, మోర్త మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి కుడిపూడి శివశంకర రావు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆత్రేయపురం : ఈ నెల 18 నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఇఒలు పి.వరప్రసాదరావు, పచ్చ సాహెబ్ తెలిపారు. మండలం మొత్తం మీద 540 మంది విద్యార్థులు రెగ్యులర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. వీరిలో మంది 259 మంది బాలురు, 281 మంది బాలికలు ఉన్నారు. గత ఎస్.ఎస్.సి పరీక్షల్లో తప్పిన 30 మంది విద్యార్థులు కూడా సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

ఉపాధ్యాయుడు శ్యామ్ మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని లొల్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు వంగపండు శ్యామ్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధ్యాయుని కుటుంబ సభ్యులకు యుటిఎఫ్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేరాలు ఘోరాలు



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-మండపేట

రాయవరం మండలంలోని చెల్లూరు యర్రమట్టిపురంలో రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వకు చేసిన పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు మంగళవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. చెల్లూరు, పాశర్లపూడిలో కోట సత్యం రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.14కు కొనుగోలు చేసి మొక్క జొన్న విత్తనాలతో కలిపి కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నారు. నిల్వ చేసిన సుమారు రూ.53,092 విలువైన 1,035 కేజీల పిడిఎస్ బియ్యం, ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేశారు. 6 ఏ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, రాయవరం సిఎస్ డిటి అలిషా, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక పంచాయతీలోని పరదేసమ్మ పేటకు చెందిన రాయుడు మహాలక్ష్మి (67) విద్యుత్ షాక్ తో మరణించినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. ఇంట్లో ఉన్న వాటర్ హీటర్ వల్ల ఈ ప్రమాదం సంభవించిందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిసిల అభ్యున్నతికి కృషి చేస్తా

ప్రజాశక్తి-ఆత్రేయపురం

టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిగిలిన సామాజిక వర్గాలతో పాటు బిసిల అభ్యున్నతికి విశేష కృషి చేస్తుందని కొత్తపేట టిడిపి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని వెలిచేరు యుజిపాలెంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టి అమలు చేసే పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్రమూర్తి, చిటికెన సత్యనారాయణ, ముల్లపూడి భాస్కర రావు, జుజ్జువరపు శ్రీహరి పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

25న భవన నిర్మాణ కార్మికుల సభ

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 25న నిర్వహించే భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపు ఇచ్చారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు అందరూ మహాసభలో పాల్గొనాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరించాలని, మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సిఐటియు నాయకులు నూకల బలరాం, జి.దుర్గాప్రసాద్, భాస్కరరావు, భవన నిర్మాణ యూనియన్ నాయకులు కాళిదాసు, మోహనరావు, నల్లిప్రసాద్, వేణు, నక్క రామారావు, రాపాక చిన్ని, శ్రీనివాసరావు, రమణ, సుబ్బారావు, అయ్యప్ప పాల్గొన్నారు.

రక్తహీనత, ఎంసిపి కార్డులపై అవగాహన

ప్రజాశక్తి-మండపేట

గర్భిణులకు, బాలింతలకు కిశోర బాలికలకు రక్తహీనత, ఎంసిపి కార్డులపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సిడిపిఒ ఎ.గజలక్ష్మి అన్నారు. పట్టణంలోని రావులపేట, గొల్లపుంత కాలనీలో గర్భిణులకు, బాలింతలకు పోషణ పక్వాడాపై, కిశోర బాలికలకు రక్తహీనత, ఎంసిపి కార్డులపై వారు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పౌష్టికార పక్షోత్సవం కార్యక్రమంలో కాలనీ ప్రజలంతా పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సింహాచలం, అంగన్వాడీలు, పాల్గొన్నారు.

విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు ఈ నెల18 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సౌజన్యంతో 10 ప్రథమ ద్వితీయ, తృతీయ శ్రేణి విద్యార్థులకు బహుమతులు మెమొంటోలు అందజేశారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్స్ పెన్నులు అందజేశారు. ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, అద్దంకి గోవిందరాజు, పసుపులేటి మెహర్ సుజాత, అరవ విస్సు, కోడి ప్రసాద్, పూర్వ విద్యార్థులు తోలేటి సూర్య, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చేయూతతో లబ్ధి

ప్రజాశక్తి - అంబాజీపేట



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు, జెడ్‌పి ఛైర్మన్

పేద మహిళలకు వైఎస్ఆర్ చేయూతతో సిఎం వైఎస్.జగన్ ఆర్థిక లబ్ధి చేకూర్చారని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, జెడ్‌పి ఛైర్మన్, వైసిపి ఇన్‌ఛార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. క్రాంతి పథం ఎపిఎం గంగాధరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన ఆసరా సొమ్ములతో ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలన్నారు. జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఎన్.నాగరాజు, ఎస్.లక్ష్మీ బార్గవి, సొసైటీ ఛైర్‌పర్సన్ డి.సత్యమోహన్, సర్పంచ్ కోట బేబీరాణి, నాగవరపు నాగరాజు, గోగి శ్రీరామమూర్తి, మద్దింశెట్టి మల్లిబాబు, వాకపల్లి శ్రీనివాసరావు, శ్రీను, కేతా రాజు, మట్టపర్తి హరి పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బోస్

మండలంలోని వెంకటాయపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి, రామచంద్రపురం ఎంపిపి అంబటి భవాని, కె.గంగవరం ఎంపిపి పంపన నాగమణి, డిసిఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఎపిఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఎంపిటిసి కణితి ఈశ్వరి, శెట్టిబలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు రాయుడు చందర్రావు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, ఎంపిడిఒ రామచంద్రమూర్తి, ఇఒపిఆర్‌డి సెలెట్ రాజు, వైసిపి నాయకులు యల్లమిల్లి రవికుమార్, అంబటి నెహ్రూ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కోటిపల్లి శివరాత్రి ఆదాయం రూ.10.43 లక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయానికి రూ.10,43,544 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ శ్రీదేవి తెలిపారు. మహాశివరాత్రి ముగిసిన తర్వాత సోమవారం సోమేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ వాసంశెట్టి శ్రీను, గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటికే పాలనా యంత్రాంగం

ప్రజాశక్తి - అంబాజీపేట

సచివాలయ వ్యవస్థలు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో ప్రజల ముంగిటకు తీసుకు వచ్చిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం పుల్లేటికుర్రు, మొసలపల్లిలో, గంగలకుర్రు, మాచవరంలో సచివాలయ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ భవనం ఏర్పాటు ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు మేలు చేకూరుతుందన్నారు. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, మొసలపల్లి సర్పంచ్, గంగలకుర్రు సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతాకుమారి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, సొసైటీ ఛైర్మన్ దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

ఇంటింటా కాంగ్రెస్ పార్టీ ప్రచారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గెద్దం సురేష్ బాబు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు దివి వెంకన్న బాబు ఆధ్వర్యాన సోమవారం ప్రచారం చేపట్టారు. అనంతరం తాడి తాతారావు కళ్యాణమండపంలో సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, వడ్డి నాగేశ్వరరావు, అయితాబత్తుల పండు బాబు, గోడి భాస్కరరావు, కంచు స్తంభం సోనీ, పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, సాధనాల రాజాజీ, చెల్లూరి బాలకృష్ణ, అంగాడి రేవతి, పెమ్మాడి స్వామి, అర్ధాని నాగరాజు, మల్లాడి శ్రీను, పాలెపు శ్రీను, పాలెపు ధర్మారావు, మల్లాడి ధర్మారావు పాల్గొన్నారు.



నూకాంబిక బుట్టగరగ ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరు నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం బుట్ట గరగ ఉత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఏప్రిల్ 7న జాతర, 8న తీర్థ మహోత్సవం, 9న ఉగాది పురస్కరించుకుని జరగబోయే జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా తాటాకు బుట్టలో అమ్మవారికి పసుపు, కుంకుమ, బియ్యము, వేపాకుతో ప్రత్యేకంగా అలంకరించిన తాటాకు బుట్టతో తొలుత గ్రామ పురవీధుల్లో తిరిగి ధాన్యం, బియ్యం, పసుపు, కుంకుమ, చలివిడి, పానకాలు పుష్పాలతో నివాళులు అందుకుంటారు. రెండో రోజు సందిపూడి, మూడో రోజు పినపళ్ల, ఆలయ ఆచార వ్యవహారాల్లో భాగంగా ప్రతి ఏడాదీ రోజుకొక గ్రామం చొప్పున ఆసాదుల చర్మకార వాయిద్యాలతో గరగ ఊరేగుతుందన్నారు. పౌర్ణమి రోజున మొదలు అమావాస్య వరకు పదిహేను రోజులపాటు మోదుగు పువ్వుల ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మద్దూరు శివరామకష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆసాదులు పాల్గొన్నారు.

మోడరన్'లో ఫేర్ వెల్ వేడుకలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని మోడరన్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత జివి.రావు మాట్లాడుతూ ఒత్తిడి దరి చేరకుండా ఆటవిడుపుగా ఉండటానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి దశలో కీలకమైన మలుపు అని, విద్యార్థులు శ్రద్ధగా పరీక్షల పై దష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆదరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.చిట్టిబాబు, హైస్కూల్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం తహశీల్దార్‌గా రాజరాజేశ్వరి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం




బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు రాజరాజేశ్వరితో సిబ్బంది

కపిలేశ్వరపురం తహశీల్దార్‌గా రాజరాజేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆమె పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి నుంచి బదిలీపై వచ్చారు. ఇంత వరకు పని చేసిన తహసిల్దార్ కె.సాయికృష్ణ రామచంద్రాపురం ఆర్‌డిఒ కార్యాలయం ఎఒగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన రాజరాజేశ్వరిని డిటి శ్రీనివాస్, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శతాబ్ది కళాశాలలో ఫేర్‌వెల్ ఉత్సవాలు

ప్రజాశక్తి-కొత్తపేట



వేడుకల్లో పాల్గొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని శాసన మండలి మాజీ ఇన్చార్జి ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం (ఆర్ఎస్) సూచించారు. స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో ఆదివారం శతాబ్ది గాలా డైనమిక్ బ్లాస్ట్ 2కె24 పేరిట ఫేర్‌వెల్ సెలబ్రేషన్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల పరిపాలనాధికారి రెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు జి.శ్రీనుబాబు, ఎన్.జయరాజు, జి.గోపాలకృష్ణ, ఎం.సుధ, ఎన్.దొరబాబు, డి.లీలా ప్రవీణ, వివివిఎస్.సుబ్బారావు, ఎస్.ప్రశాంత్ కుమార్, అల్లాడి సాయి భాస్కర్ పాల్గొన్నారు

విద్యార్థులకు పెన్నుల బహూకరణ

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యా వికాస్ కాన్వెంట్‌లో పదవ తరగతి విద్యార్థులకు విశ్రాంత హెచ్ఎం గెడా శ్రీనివాస్ పెన్నులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం బొబ్బా రామయ్యచౌదరి, వ్యక్తిత్వ వికాస నిపుణురాలు అరుణ, విద్యావికాస్ అధినేత చామర్తి ప్రభాకరరావు పాల్గొన్నారు.